## బలివాడ కాంతారావు

# పావురాల కథ



వర్షాలు పడ్డాక ఢిల్లీ కాస్త నల్లబడింది. బ్రహ్మదేవ్ యేంరాసాడో యెంత డబ్బు మనియార్డరు చేసాడోగానీ, యింటినించి సంతోషిస్తూ మారటితల్లి కూడా వుత్తరం రాసింది. ఆనందం, బ్రహ్మదేవ్ యింటిమనిషి అయిపోయాడు. బ్రహ్మదేవ్‌కి ఆనందం కంటికి జోడులా, చేతికి కర్రలా వుంటున్నాడు. ఇక పిల్లలకు తల్లితండ్రులకన్నా తన దగ్గరే హెచ్చుచేరికగా వుంది. సెప్టెంబరునెలలో చలి ఒకసారి ముఖం చూపించి, ముసుగు వేసుకుంది. ఈసిగ్గు యెన్నాళ్ళిక? కొత్తగా వచ్చిన పెళ్ళం యిచ్చే మధురానుభూతులే ఢిల్లీ వాతావరణం ప్రజలకు కలగజేస్తోంది యీనెలలో!

సాయంత్రం, ఎరుపుమీద నలుపు డిజైనుతో నున్న బాటిక్ చీరను ముసుగు వేసుకున్న మగువలా వుంది పశ్చిమ ఆకాశం. మెరుస్తున్న ఒకేచుక్క ముక్కుపుడకలావుంది. అలాంటి సమయంలో ఆనందం బ్రహ్మదేవ్‌ని ప్రశ్నించాడు.

"అయ్యా! ఢిల్లీలో నలుగురి గురించి తెలుసుకోవాలన్నారు. సామాన్యుని గురించి వివరంగా చెప్పారు. ఇక రెండో అసామీ యెవరో అతని గురించి వివరంగా చెప్తారా?"

కాస్సేపు మౌనంగానున్న బ్రహ్మదేవ్ చివరకు "రెండోవాని గురించి అప్పుడే తెలుసుకున్నావ్ కదూ?"

"ఎవరండీ?''

"అఫీషియల్..."

"ఓహో...ఇక మూడోవాని గురించి చెప్పండి"

"ఎప్పుడో చెప్తానుగానీ-నాదొక చిన్న కోరిక''

"చెప్పండి"

"కిషన్, యీ వూర్లోవుండి కుతుబ్ యెన్నిసార్లు చూసాడంటావ్? లాల్ ఖిల్లాలో యెన్నిసార్లు వాడిపాదం మోపాడంటావ్?"

"ఎన్నిసార్లన్నా వెళ్లవచ్చు''

"నాకు తెలిసినమట్టుకు గడిచిన పదేళ్లలో ఒక్కసారైనా చూడలేదనుకుంటాను ఇంతెందుకు వాడు చిన్నప్పుడు యెప్పుడో తాజ్ చూసాడు. ఇంత దగ్గర్లో వుండి యిప్పటికి తాజ్ చూడాలనే భ్రాంతిలేని వాడ్ని యేమనాలో చెప్పు?"

'తాజ్ తనెప్పుడు చూస్తానా' అని ఆనందం పెద్దగా నిట్టూర్చాడు.

"ఒక కట్టడం చరిత్ర తెలుసుకోకండా చూసినదానికీ, చరిత్ర తెలుసుకొని చూసినదానికీ, చాలా తేడావుంది కదూ? మొదటి రకంవాళ్లకి పుత్తిరాళ్ళే కనిపిస్తాయి. రెండోరకం వాడికి ప్రాణంతో కదుల్తున్న మూర్తులు కనిపిస్తాయి. వాతావరణం హాయిగా వుంది. నీకు తీరుబడి వున్నప్పుడల్లా నా మనుమడు, మనుమరాలికి ఢిల్లీలోవున్న చారిత్రక కట్టడాల గురించి ముందు చెప్పి తరువాత ఆ ప్రదేశానికి తీసుకవెళ్ళి చూపిస్తావుకదూ..."

"తప్పకండా-నా కోరికా నెరవేరుతుంది'' అన్నాడు ఆనందం. ముందు ప్లాను వేసుకోవాలి. ఈ యిద్దరు పిల్లలే ముఖ్యంగా ఇందు సామాన్యమైన పిల్ల కాదు. తను జవాబుకు తడుముకునే ప్రశ్నలు యెన్నోవేస్తుంది. ఆ వయస్సులో తను మంకులా వుండేవాడు. వీళ్లు బంతుల్లా యెగురుతున్నారు. ఇది మట్టి సారమో, లేక పెరిగిన వాతావరణం మహత్యమో గానీ యీ పిల్లల్లా దేశంలో అందరు పిల్లలూ వుంటే భూలోకస్వర్గ యింకోచోట లేదనిపించేది. కలా అనుకుంటుంకగానే యింట్లోబాత్‌రూము వెంటిలేటరుమీద రెండు పావురాలు బ్రాలి మూలుగుతున్నాయి. బహుశః అక్కడ గుడ్లు పెట్టడానికిగూడు తయారుచేసుకుంటున్నాయేమో? చీకటిపడగానే గడ్డిగాదర యేరుకునే అవకాశంలేక అక్కడ మూలుక్కుంటున్నాయ్...

"అంకుల్, అంకుల్! ఆ పావురాలు యేంమాటాడుకుంటున్నాయో చెప్పవూ," అని ఇందువచ్చి అడిగింది. పెద్దవాళ్లకైతే ప్రేమబాసలు ఆడుకుంటున్నాయని మహా తెలిసినట్లు చెప్పేవాడు. ఈ పిల్ల దగ్గర అబద్ధం ఆడలేడు. అంచేత—

"ఆ బాస నాకు తెలీదు తల్లీ" అన్నాడు.

"పిల్లి పిల్లలమీద కథ చెప్పావుగా పావురాలమీద కథ చెప్పవూ?"

"అలాగేలే—"

''అయితే తొందరగాచెప్పు అంకుల్" అంటూదగ్గరకూర్చుంది. "ఇప్పుడేయెలా చెప్పనూ? ఆలోచించనీ-రేపోయెల్లుండో చెప్తాలే''

ఆ రాత్రి కథ గురించి ఆలోచిస్తూ పరుపుమీద దొర్లుతున్నాడు. ఈ వూర్లో యెక్కడా పావురాలు మూకలే; పూర్వకాలం యీ పావురాలను పోష్టుమన్లుగా వాడేవారు. ఈ కాలంలో వీటిని శాంతి చిహ్నాలుగా యెగరవేస్తున్నారు కొందరు. పాతఢిల్లీలో పావురాల పందాలుగురించి విన్నాడు గానీ చూడలేదు. అక్కడక్కడా యిళ్లమీద యెత్తయిన యెదురు కొయ్యలమీద నిలబెట్టిన చేటలమీద పావురాలు వాలుతుంటాయ్.

"నువ్వూ-తమ్ముడూ పావురాలు లాంటివాళ్ళేనే" అని చెప్తే వూరుకోదే; ఆ అమ్మాయికి కథ కావాలి. ఏ ఆలోచన రాక నిద్రపోయేసరికి బాగా రాత్రయింది.

ముందురోజు అనుకున్నట్లు ఉదయం పిల్లలు తయారైపోయారు గానీ తనింకా కాలేదు. ఈవేళ తమ ఢిల్లీ యాత్రలో తొలిఘట్టం చూడబోతున్నారు ముగ్గురూ. బస్సులో మెహరాలీలో నున్న కుతుబ్ చేరేసరికి తొమ్మిదైంది. ఇదివరకే పిల్లలకు యీ కుతుబ్ దాని చుట్టుపట్ల నున్న కట్టడాల గురించి చెప్పాడు వాళ్లు వచ్చిన సమయానికే టూరిష్టు బస్సులు రెండు వచ్చాయి అందులోనించి దిగినవాళ్లల్లో చాలామంది విదేశీయులే; వాళ్లవెంటబడితే గైడు చెప్పింది పిల్లలుకూడా వింటారని ఆనందం పిల్లలతో వాళ్ల వెనుకనే నడిచాడు. గైడు వాళ్లను కుతుబ్‌మీనార్‌కి ముందుగానే లాన్‌లో ఆపి గట్టిగా అరుస్తూ చెప్తున్నాడు.

''అదిగో మీరు చూస్తున్నారే...అది కుతుబ్‌మీనార్. దాన్ని 1200 సం॥లో కుతుబుద్దీన్ ఐబెక్ కట్టడం మొదలు పెట్టాడు. ఒక అంతస్థే కట్టాడు. అతని అల్లుడు అల్తుమష్ మూడు అంతస్థులు వేసాడు...ఫిరోజ్‌షా ఐదో అంతస్థు కట్టాడు. ఆ ప్రక్కన తూర్పుకు వుందే దాన్ని అలైదర్వాజా అంటారు. దాని కదేసాటి. దాన్ని అల్లావుద్దీన్ ఖిల్జీ కట్టాడు. అటుప్రక్కన ఆ పడమరకు కువత్-ఉల్-ఇస్లామ్ మసీదు. దాన్ని కుతుబుద్దీనే కట్టించాడు—అదిగో పూర్తి కాకండా వుందే -- దాన్ని అలైమీనార్ అంటారు.''

ఇలా చెప్తుండగానే అంతవరకు ఆనందంలానే వింటున్న యువకుడొకడు అరిచాడు.

''చెప్పడం చాతకాక చరిత్రను ఖూనీ చేస్తున్నావ్. ఆపు" ఆనందం వెనుకకు తిరిగేసరికి ఒక యువకుడు నిల్చున్నాడు. దళసరి కళ్లద్దాలున్నాయ్. నల్లని మోటు దళసరి జుత్తు చెదరి ముఖంమీద పడుతోంది. ఆ గొంతుక యెంత తీవ్రంగా వుందంటే చెప్తున్నవాడు ఆగిపోయాడు. టూరిష్టులు గుసగుసలాడుకుంటుంటే అతను ముందుకొచ్చి "నేను

ఎవర్నని గుసగుస లాడుకుంటున్నారా? నా పేరు రవీంద్రనాధ్ మైత్రా...నాతో రండి, నేను చెప్తాను...మొదట కుతుబ్ యెక్కడానికి టికెట్లు తీసుకోండి. నాక్కూడా ఒకటి''. టికెట్లు వచ్చాయి. అందులో ఒక ముసలమ్మ యెక్కలేనని ఆ టికెట్టు మైత్రాకె యిచ్చేసింది. ఈ లోగా మైత్ర మొదలుపెట్టాడు. ఆనందం కూడా మూడు టికెట్లు తీసుకొని వాళ్ల వెంటపడ్డాడు.

''ఈ కుతుబ్‌ని-ఈ చిన్నజాగాని తీసుకొని దీనిచరిత్ర ఒక్కటే తెలుసుకుంటే లాభంలేదు. కుతుబ్ ఢిల్లీలోవుంది. ఢిల్లీచరిత్ర యేమిటి? ఒకప్పుడు యీ యమునానది ఒడ్డున పెద్ద అడవివుండేది దానికి ఖాండవవనం అనిపేరు. భయంకరమైన అడవి. అడవిలో ముళ్లడొంకల మధ్య ఒక పాడుపడిన పట్టణం. అడవి మృగాలతోపాటు యెగిరే పక్షులు, దోచుకునే దొంగలు, పీకలుకోసే రాక్షసులు వుండేవారు. అడవంతానరికి కాల్చి అందులో మృగాలనీ-మృగన్యాయంతో బ్రతుకుతున్న మనుషుల్నీ పారద్రోలి, పాతకోటరాళ్లతో యింద్రప్రస్థపురాన్ని కట్టారు పాండవులు. అలాగే తరువాత వచ్చిన మహమ్మదీయరాజులు. కుతుబుద్దీన్, ఫిరోజ్‌షా, షేర్‌షా-షహజహాన్ కూడా పాతకోటలను రాళ్లతో సహా దోచి కొత్తకోటలను కట్టించుకున్నారు. ఈ ఢిల్లీలో అన్నిటికీ షార్ట్ కట్స్--సులువుగా పని యెలాగో జరిగిపోవాలన్న కాంక్ష యీనాటిది కాదు-తరతరాలనించి వస్తున్న సాంప్రదాయం. అయినా—మీరు న్యూఢిల్లీ చూడాలని వచ్చారు. ఇది పదహారో ఢిల్లీ-మా దేశం యెన్నెన్నో రాజ్యాలుగావుండి యిప్పుడు యేకరాజ్యమైనట్లు, పదిహేను ఢిల్లీలు యేకమైపోయి యీ పదహారో ఢిల్లీనగరు-ఈ మహానగరం-మేమంతా గర్వించదగ్గ నగరం యెందుకైంది? ఈ పట్టణానికి యింత గొప్పతనం దేనికివచ్చింది?" తూరుపువేపు చూపిస్తూ "అదిగో అటు వేపు యీ ఢిల్లీకి-మధుర-కృష్ణుని జన్మస్థలం-అతను కంసుని బందిఖానాలో పుట్టాడు. అదిగో అటు పడమర-ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంవుంది, అక్కడే ధర్మసంస్థాపనకోసం యెన్నో యుద్ధాలు అక్కడే ఢిల్లీకి పడమరే జరిగాయి. ఉత్తరానికి వెళ్తే హరిద్వారం-దేవునిచేరడానికి ముఖద్వారం. దక్షిణంనుంచి వచ్చే యిసుక తుఫానులకు విసుక్కోకండి. ఆ రాజస్థాన్ యెడారి లేకపోతే మీరు చూస్తున్న యీ కుతుబ్ యే నాగపూర్‌లోనో వుండేది."

ఇలా స్థలపురాణంచెప్పి మైత్రా వాళ్లను ముందుగా మసీదు ప్రాంగణం లోనికి తీసుకవెళ్లాడు.

"ఒక్కసారి కళ్ళుమూసుకోండి. ఇక్కడ ఒకప్పుడు అనంగపాలు కట్టిన లాల్‌కోట-రక్షణకోసం కట్టిన తొలికోట వుండేది. తోమర్ రాజులు యీ యినుప స్థంబాన్ని యిక్కడ యెక్కడనించో తెచ్చిపెట్టారు. ఏనాటిదో యిది-ఇంకా తుప్పుపట్టలేదు కానీ మా చరిత్ర చూస్తే యీ దేశాన్ని పాలించిన చక్రవర్తులు-ఇదిగో-ఇక్కడనించే-దూరాన రాయ్ పిథీరా కోటశేషాలు కనిపిస్తాయ్-ఇక్కడనించి పాలించిన పృధ్వీరాజ్ చౌహాన్ కొత్తలో కొత్తయినములా బలంగా వున్నాడు. తర్వాత పాతబడి తుప్పుపట్టాడు. ఇక్కడనించే పాలించిన యింకో చక్రవర్తి అల్లావుద్దీన్ ఖిల్జీ మొదట సమర్ధులైన వాళ్ల సలహా విన్నాడు. ముసలి కాలంలో పొగడ్తకు లోనై అధికారాన్నంతా చేతిలో పెట్టుకొని, దుర్వినియోగంచేసి తుప్పుపట్టాడు.

టూరిష్టుల్లో యెవరికో అనుమానం వచ్చి—

"మిష్టర్ మైత్రా! నీవు హిందువుడివేనా?"అన్నారు.

"వెల్ సర్, అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలో పన్నులు వసూలుచేసే తురక ఆఫీసరు వుమ్మితే, ఆ వుమ్ము అందుకోడానికి హిందువులిక్కడ నోర్లు తెరిచారు. అయ్యా! వాళ్ల సంతతి వాడ్నేనండి. మా యిరవైయేడు పవిత్రమైన గుళ్లు గోపురాలు కొల్లగొట్టి కట్టినదే యీ మసీదు. ఇలారండి అదిగో అలై దర్వాజా-అపురూపమైన దర్వాజా! ఇదుగో యిటుచూడండి. ఇది అలైమీనార్ కుతుబ్‌కన్నా రెండు రెట్లు కైవారం పొడుగుతో కట్టాలనుకున్నా, అతను చచ్చాక మరిసాగలేదు.''

"ఎవరు?''

''పెళ్లాన్ని వంచలేనివాడు. మామగారూ! దయచెయ్యండి అని పిల్చి తండ్రి కొడుకు యింటికి వెళ్ళినట్లు ఆ మామగారు వెళ్తే మామగారి పీకకోసి రాజైనవాడు! ప్రజలదగ్గర డబ్బుంటే తిరుగుబాటు చేస్తారని డబ్బున్నవాళ్లని దోచినవాడు-మరెవడు? అల్లావుద్దీన్ ఖిల్జీ"

"బాల్బన్ సమాధి యెక్కడుంది ?" ఒకరడిగితే

"అల్తమష్ సమాధి యెక్కడ ?"అని మరొకరు.

"బాల్బన్ సమాధి అల్లదిగో జమాలీ మసీదుకు తూర్పుగా వుంది. పేరుకు బానిస రాజన్నా అతగాడు రాచరికం దేవుడిచ్చిన వరం అన్నాడు. పబ్లిగ్గా యెప్పుడూ మాటాడలేదు. ఆ రోజుల్లో ఢిల్లీలోని ఒక ధనవంతుడైన వ్యాపారి, రాజుగారు ఒకసారి తనకు యింటర్వ్యూ యిస్తే తన ధనరాసులన్నీ అప్పజెప్తానన్నాడు. కానీ ఆ వార్త తెచ్చినవాడి మీద విరుచుకపడ్డాడు. అతను నవ్వడంగానీ, పెద్దకొడుకు యుద్ధంలో చచ్చినా కన్నీరు కార్చటంగాని ఎవరూ చూడ

లేదట ! ఒక గవర్నరు సేవకులమీద అమానుషంగా ప్రవర్తిస్తే ఆ గవర్నరు చెమ్డాలూడదీసాడు. ప్రజలను, ప్రభుత్వం పాలించే బాధ్యతను తగ్గించుకున్నాడు. అలాంటివాని సమాధి పాడుబడి వుంది. అక్కడకు చేరలేం. పదండి. మీరు కోరిన యింకో సమాధి... ఇదిగో యీ మసీదుకి ప్రక్కనే వుంది. పైన కప్పులేదు. చూసారా ? ఎంత చక్కగా కట్టించుకున్నాడో, చచ్చేముందే అల్తమష్ ! చచ్చేముందే కొడుకులను కాదని కూతురికి రాజకీయాలు నేర్పాడు. ఆవిడే రజియా సుల్తానా. అతని తర్వాత రాజ్యానికి వచ్చింది ... ఇక పదండి మీకు టైం అయిపోతోంది. అలై దర్వాజా చూసాక కుతుబ్‌మీనార్ యెక్కుదాం. కుతుబ్ కట్టడం మొదలుపెట్టిన కుతుబుద్దీన్ ఆ రోజుల్లో ప్రపంచంలో అందరికన్నా ధనవంతుడని తెలుసా" అంటూనే అలై దర్వాజాలోనికి తీసుకవెళ్ళి, ఆ గుర్రపు నాళ్ళవంటి ఆర్చీలమీద లేసులల్లినట్లు పాలరాతితోనూ, యెరుపు రాతితోనూ చెక్కిన చిలుకులుచూస్తూ మురిసిపోండని వాళ్ళనక్కడ విడచిపెట్టాడు. మైత్రా ఒక మూల నిల్చొని కుతుబ్‌వేపు చూస్తున్నాడు. ఈ కుతుబ్‌ని మధ్యయుగంలో చూసిన యిబిన్ బటూటా "వన్ ఆఫ్ ది వండర్స్ ఆఫ్ ది వరల్డ్" అన్నాడు. స్లీమన్, గోరీల్లో తాజ్ యెంత గొప్పదో ధ్వజస్తంభాల్లో యీ కుతుబ్ అంత గొప్పదన్నాడు. దీనిమీద ఉర్దూ అక్షరాలతోపాటూ హిందీ అక్షరాలూ వున్నాయట ! మైత్రా కంటికి కనపడలేదు. ఒకో అంతస్తుమీద అవి కట్టించిన వాళ్ళ పేర్లు వున్నాయట.

ఈ మహామీనార్‌కి రెండు భూకంపాల బాధ తప్పలేదు. ఇలా ఆలోచనలో పడిన మైత్రాకు ఒక లేడీ టూరిస్ట్ - చక్కగా వుంది — చాక్‌లెట్ ఆఫర్ చేసింది. అందుకుని అంతా పైకెక్కారు. మొదటి అంతస్థు చివరవరకే వెళ్ళనిస్తారు. మెట్లు యెగబ్రాకి పైనున్న గేటునించి డాబాపైకి రాగానే చల్లని గాలి వీచింది. ఆనందం యిద్దరు పిల్లలు కూడా వాళ్ళతోపాటే యెక్కారు. ఇందు చప్పున.

"అంకుల్ ... అంకుల్ ... " అంటూ "అటు" చూడమంది. అలై దర్వాజామీద పావురాల మందలు యెగురుతున్నాయి. కొన్ని వాలుతున్నాయ్. ఇంకా పావురాలమీద కథ ఆనందంకు తప్పడంలేదు. ఇంతలో మైత్రా గొంతుక వినిపించింది.

"మిత్రులారా ! చూడండి ... అదిగో దూరాన్న జుమ్మా మసీదు. బ్రిటిష్ వాళ్ళు పాలించే రోజుల్లో యేంజరిగిందో తెలుసా ?"

"ఖూనీలా ... ?" అన్నాడొకడు.

ఈ ఢిల్లీ సీమలో ఖూనీలకు కొదవ లేదు. ఈ ఢిల్లీకి యీ పేరు యెవరి మూలాన వచ్చిందో ఆ రాజా దిల్లూనే యిక్కడ ఖూనీచేసారు. కుతుబుద్దీన్, చౌగన్ (పోలోలాంటి ఆట) ఆడుతుండగా చంపేసారు కదూ ! కుంటి తైమూరు ఢిల్లీవరకూ తీసుకవచ్చిన హిందూ ఖైదీలను, యిక్కడకు రాగానే వాడికేం రిమ్మెత్తిందో ? లక్షమందినీ చంపేసాడు. న్యాయానికి కట్టుబడే బ్రిటీష్‌వాళ్ళు...ఖూనీ దర్వాజా అన్న పేరే సృష్టించారు."

"జుమ్మా మసీదులో యేం జరిగింది ?" ఒక టూరిస్ట్ ప్రశ్న.

"థియోడోర్ బెక్ 1889 లో ఆలీఘర్‌నించి వచ్చి అక్కడే ప్రార్థన చేసి వస్తున్న యిరవైవేలుపైగా ముస్లిముల సంతకాలు తీసుకున్నాడు. బ్రిటీష్ ప్రభుత్వంకు పంపబోయే మహజర్‌లో మాకు స్వరాజ్యంవద్దని రాసి, సంతకాలు పెట్టేవాళ్ళకు యేంచెప్పాడో తెలుసా ? హిందువులు ఆవును చంపవద్దని మహజరు పెట్టారు. దానికి ఒప్పుకోవడంలేదని ముస్లిములంతా యీ మహజరు పెట్టున్నారన్నాడు. ఆ మహజరు ... నా దగ్గరుంది ..." అని మైత్రా జేబులోనించి ఒక కాగితం తీసాడు. అది దళసరి కాగితం. చుట్టి వుంది.

"వెల్ మై ఫ్రెండ్స్ ! ఆ పావురాలు అల్లావుద్దీన్ ఖిల్జీ అలై దర్వాజా కట్టిన్నాడూ అలానే యెగిరాయ్ ! ఇప్పుడూ అలానే యెగురుతున్నాయ్. అల్లావుద్దీన్ ఆ రోజుల్లో తల్లుల యెదురుగానే పావురాల్లాంటి పసిపిల్లల పీకలెన్నో కోసాడు. ఈనాడూ మనిషి ... ఇదిగోండి — ఈ కాగితం ! ఆశపెట్టిన కాగితం — ఆశనే చంపుతున్న కాగితం ఆ థియొడోర్ బెక్ సృష్టించిన కాగితంలాంటిదే మా ప్రభుత్వం సృష్టించి నాకిచ్చింది ... "

అంటూ ఆవేశంతో మైత్రా ఆ తెల్లని పట్టాని, ముక్కచెక్కలుగా చించి పైకి విసిరేస్తూ ఒక్కసారి అక్కడనించి క్రిందకి దూకేసాడు.

తెల్లపావురాల్లా యెరుగుతూ దిగిన కాగితం ముక్కలు కొన్ని మైత్రా శవంపై రాలాయి.

ఆ మరుచటి రోజు పేపర్లో ఒక మూల వార్త :

'మాస్టర్స్ డిగ్రీ యిన్ ఆర్ట్స్ వున్నా, ఉద్యోగం లేక మూడేళ్ళనించీ బాధలు పడ్తున్న యువకుడు - రవీంద్రనాథ్ మైత్రా కుతుబ్‌మినార్‌నించి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.'